ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 7 ఆగస్టు 2024




ఎర్రాజీ జ్యోతి ప్రదర్శన (ఫైల్)

పారిస్ విశ్వ క్రీడా వేదికపై

నేడు విశాఖ యువతి ప్రదర్శన

ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై ఎర్రాజీ జ్యోతి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 6: విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి బుధవారం ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పరుగు తీయనున్నది. 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఒలింపిక్స్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి మహిళా 100 మీటర్ల హర్డలర్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. తాను నెలకొల్పిన జాతీయ రికార్డులను తిరగరాసుకుంటూ ఫాస్టెస్ట్ రేసర్‌గా గుర్తింపుపొందిన ఎర్రాజీ జ్యోతి...విశ్వ క్రీడల్లో కూడా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతోంది.

- 100 మీటర్ల హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్‌కు సన్నద్ధం
- మధ్యాహ్నం 1.55 గంటలకు రేస్ ప్రారంభం...
- బలమైన ప్రత్యర్థులతో పోటీ
- ఫైనల్స్‌కు చేరడంపై ఆశాభావం



క్రీడాభిమానులలో ఆకాంక్ష

ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన జ్యోతి...ర్యాంకింగ్ ఆధారంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా సమ్మర్ ఒలింపిక్స్‌కు ర్యాంకింగ్ ఆధారంగా 40 మంది అర్హత సాధించగా, ఎర్రాజీ జ్యోతి 34వ ర్యాంకుతో ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి ప్రవేశించింది. ఒలింపిక్స్‌కు ముందు జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల అత్యుత్తమ టైమింగ్‌తో రేస్‌ను పూర్తిచేసిన జ్యోతి...బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో బలమైన ప్రత్యర్థులతో పోటీపడబోతున్నది.

విశాఖకు గర్వకారణం

అత్యంత సాధారణ కుటుంబం నుంచి అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించిన జ్యోతి నేడు ఒలింపిక్స్‌లో పాల్గొనసుండడం విశేషం. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో సాధన కొనసాగించింది. అనతికాలంలోనే 100 మీటర్ల హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగింది. అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించింది. భారత అథ్లెటిక్స్ రంగంలో అత్యంత వేగవంతమైన హర్డిలర్‌గా ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరిన ఎర్రాజీ జ్యోతి విశాఖ వాసి కావడం నగరవాసులందరికీ గర్వకారణం.

హర్డిల్స్ షెడ్యూల్: 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్ బుధవారం మొదటి రౌండ్ హీట్స్‌తో ప్రారంభమైంది. గురువారం రిపిచేజ్ రౌండ్, ... మిగతా 6వ పేజీలో

మహా ఉత్కంఠ

నేడే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

49కి పెరిగిన కూటమి బలం | **47కి తగ్గిన వైసీపీ బలం**

- అందులోనూ మరో నలుగురు వైవీ సుబ్బారెడ్డి సమావేశానికి డుమ్మా
- వారంతా కూటమికి మద్దతు ప్రకటిస్తారని ప్రచారం
- కార్పొరేటర్లను శిబిరాలకు తరలించిన ఇరు వర్గాలు
- ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ప్రకటన
- వైరిపక్షాల ఓట్ల కోసం ఇరుపక్షాల ప్రయత్నాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక రసకందాయంగా మారింది. వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ కంటే కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి) స్వల్ప ఆధిక్యం కలిగి ఉండడంతో ఎన్నికపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కూటమికి 49 మంది కార్పొరేటర్ల బలం ఉండగా, వైసీపీకి 47 మంది బలం ఉంది. దీంతో ఇరుపక్షాలు తమ కార్పొరేటర్లను బుధవారం నేరుగా పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చేలా శిబిరాల్లో ఉంచాయి. వైసీపీ నుంచి మరి కొందరు తమ వైపు వచ్చేస్తారని కూటమి నేతలు చెబుతుంటే, తమకు కూటమిలోని కార్పొరేటర్లు ఓటేస్తారని వైసీపీ నేతలు చెబుతుండడంతో ఇరువర్గాల నుంచి పోటీ చేస్తున్నఅభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

జీవీఎంసీలో అత్యంత కీలకమైన స్టాండింగ్ కమిటీకి బుధవారం ఎన్నిక జరగనున్నది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి పది మంది కార్పొరేటర్లు, వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీలో నిలిచారు. జీవీఎంసీలో 98 వార్డులు ఉండగా ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. కార్పొరేటర్లకు మాత్రమే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. జీవీఎంసీ చేపట్టే రూ.50 లక్షలలోపు విలువైన పనులతోపాటు పరిపాలనా పరమైన నిర్ణయాలను తీసుకునే అధికారం స్టాండింగ్ కమిటీకి ఉంటుంది. దీంతో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందితే ఆయా పనులు చేపట్టేందుకు, బిల్లులు చెల్లించేందుకు ఇబ్బంది ఉండదు. రూ.50 లక్షలకు పైబడిన పనులు, నగరమంతటికీ వర్తించే నిర్ణయాలను మాత్రమే కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. కౌన్సిల్ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగితే స్టాండింగ్ కమిటీ సమావేశం మాత్రం ... మిగతా 6వ పేజీలో



స్థాయీ సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సర్వంసిద్ధం

- ఉదయం పదిన్నరకు పోలింగ్ ప్రారంభం
- సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి
- ఏర్పాట్లు పూర్తిచేసిన జీవీఎంసీ అధికారులు
- జీవీఎంసీ కార్యాలయం వద్ద పోలీస్ భద్రత

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ బుధవారం ఉదయం 10.30 ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగుస్తుంది. సాయంత్రం ఓట్లు లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు. పోలింగ్ సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని సీపీ శంఖబ్రతబాగ్చిని జీవీఎంసీ అధికారులు కోరారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఓటు హక్కు కలిగిన 97 మంది కార్పొరేటర్లు ఓటు వేసేందుకు వచ్చినప్పుడు విధిగా తమ గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, పెన్నులుగానీ అనుమతించరు. కార్పొరేటర్లు తమ సెల్‌ఫోన్‌లు, పెన్నులు, వాచీలు వంటి వస్తువులను పోలింగ్ కేంద్ర ప్రవేశం వద్ద ఉండే ఓటరు ఐడెంటిఫికేషన్ ఆఫీసర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. అనంతరం తమ గుర్తింపు కార్డును చూపించి, ఓటరు స్లిప్ తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాల్సి ఉంటుంది. పోటీలో ఉన్న 20 మంది అభ్యర్థుల పేర్లు తెలుగు అక్షరమాల క్రమంలో పది మందివి ఒకవైపు, మరో పది మందివి మరొకవైపు బ్యాలెట్ పేపర్‌పై ఉంటాయి. ఒక ఓటరు గరిష్ఠంగా పది మందికి మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకవేళ 11 మందికి ఓటేస్తే ఆ ఓటు చెల్లనిదిగా పరిగణిస్తారు. పోలింగ్ బూత్‌లో ఉండే స్టాంపెడ్, ఇంటు మార్కు కలిగిన పరికరంతో తాము ఓటు వేయాలనుకుంటున్న అభ్యర్థి పేరు ఎదురుగా 'ఇంటు' మార్కును ముద్రించి బ్యాలెట్ పేపర్‌ను బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది.

ఖరారు చేసిన కూటమి నాయకులు

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద


పీలా గోవింద

- నేడు అధికారికంగా ప్రకటన
- గెలుపునకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రణాళిక
- పర్యవేక్షణకు ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీ
- ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగింత
- వైసీపీ నుంచి భారీగానే వలసలు?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి కూటమి అభ్యర్థిగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద పేరు ఖరారైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరి దిలీప్ చక్రవర్తి, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, భీమిలి నియోజక వర్గానికి చెందిన కోరాడ రాజబాబు, తదితరులు పోటీకి ఉత్సాహం చూపించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో నేతలు సుదీర్ఘంగా చర్చించి, ఆసక్తి చూపుతున్న వారందరి పేర్లు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు పంపించారు. గండి బాబ్జీ మంగళవారం విజయవాడ వెళ్లి చంద్రబాబును కలిశారు. అన్నింటినీ పరిశీలించిన తరువాత పీలా గోవింద పేరు ఖరారు చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు యువ నేత, మంత్రి నారా లోకేశ్ సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమి గెలుచుకొని తీరాలని స్పష్టంచేశారు. ఏ ప్రణాళిక వేసినా పక్కాగా ఉండాలని, ఎవరూ చేజారిపోకుండా చూసుకోవాలని సూచించారు.

రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ విశాఖలోనే ఉండి ఈ ఇరవై రోజులు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన మంత్రి వంగలపూడి అనిత కూడా ఈ ఎన్నిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇక్కడకు వచ్చే మంత్రులు ప్రాంతాల వారీగా బాధ్యతలు తీసుకొని పనిచేయనున్నట్టు సమాచారం. జీవీఎంసీ మొత్తం అచ్చెన్నాయుడు చూసుకుంటారని విశ్వసనీయంగా తెలిసింది. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల బాధ్యతను ఎంపీ సీఎం రమేశ్‌కు అప్పగించనున్నట్టు తెలిసింది.

నేడు అధికారికంగా అభ్యర్థి ప్రకటన

ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలా గోవింద్ పేరును కూటమి నాయకత్వం బుధవారం ప్రకటించనుంది. అనేక మంది ఈ సీటు కోసం ప్రయత్నించినా అధిష్ఠానం గవర సామాజిక వర్గానికి చెందిన గోవింద్‌కే ఇవ్వాలని నిర్ణయించింది. వైసీపీ కాపు సామాజిక వర్గానికి చెందిన బొత్స సత్యనారాయణను రంగంలోకి దించినందున కూటమి అభ్యర్థి కూడా అదే సామాజికవర్గం అయితే బాగుంటుందని పలువురు పార్టీ పెద్దలకు సూచించారు. అదేవిధంగా మాడుగుల, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గణబాబులు కూడా అభ్యర్థి ఎవరైతే బాగుంటుందో సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. అందరి వాదనలు, అభిప్రాయాలు ... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

- 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకారం
- 30న పోలింగ్, సెప్టెంబరు 3న కౌంటింగ్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసింది. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. సెప్టెంబరు మూడో తేదీన ఓట్లను లెక్కించి ఎవరు ఎన్నికైనదీ ప్రకటిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఐల పోస్టింగ్‌లపై సీపీ కసరత్తు

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బదిలీలపై సందిగ్ధం
- సిఫార్సులను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారనే దానిపై ఆసక్తి

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లపై సీపీ శంఖబ్రత బాగ్చి కసరత్తు పూర్తిచేసినట్టు తెలిసింది. సాధారణ ఎన్నికల తర్వాత నగరంలో సీఐల బదిలీలు చేపట్టలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న వారంతా వైసీపీ హయాంలో వచ్చినవారే. దీంతో కూటమి నేతలు తమకు అనుకూలమైన వారిని తెచ్చుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. విశాఖ రేంజ్ పరిధిలో ఇటీవల 35 మంది సీఐలను డీఐజీ గోపీనాథ్‌జెట్టీ బదిలీ చేశారు. వారిలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేస్తున్న 15 మందిని రేంజ్ వీఆర్‌కు సరండర్ చేశారు. వారంతా నగరానికి వస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం పలువురు ప్రజాప్రతినిధుల నుంచి వారు సిఫారసు లేఖలు తీసుకుని సీపీకి అందజేసినట్టు సమాచారం. అయితే ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ చేపట్టలేదని అధికారులు చెబుతున్నారు.

నగరంలో పనిచేస్తున్న 25 మంది సీఐలను రేంజ్‌కు సరండర్ చేసి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని సీపీ జాబితా సిద్ధం చేశారని, అయితే ఉత్తర్వుల జారీకి ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడిందంటున్నారు. ఈ నేపథ్యంలో బదిలీలు/ పోస్టింగ్‌లపై స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘానికి సీపీ లేఖ రాసినట్టు చెబుతున్నారు. అనుమతి రాకుంటే సెప్టెంబరు ఆరు తర్వాతే బదిలీలు చేపట్టే అవకాశముంది. ముక్కుసూటి అధికారిగా సమర్థతకు పెద్దపీట వేస్తారనే గుర్తింపున్న సీపీ శంఖబ్రత బాగ్చి నగరంలో సీఐల పోస్టింగ్‌ల విషయంలో ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రజా ప్రతినిధులను సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండా సమర్థులు, నిజాయితీగా పనిచేస్తారనే గుర్తింపున్న సీఐలను మాత్రమే తీసుకోవాలని సీపీ భావిస్తే పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న సీఐలకు నిరాశే మిగులుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తం

ఎక్కడికక్కడ పొంగిపోతున్న మ్యాన్‌హోల్స్

- రోడ్లపై నుంచి తరచూ మురుగునీటి ప్రవాహం
- నిర్వహణకు ఏటా రూ.రెండు కోట్లు వెచ్చిస్తున్న జీవీఎంసీ
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా పనులు
- పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు


రామ్‌నగర్‌లో యూజీడీ మ్యాన్‌హోల్ పొంగిపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని దాటుతున్న స్థానికులు


వెంకోజీపాలెంలో మురుగు నీటిని దాటుకుని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిపోయింది. పైప్‌లైన్‌లలో సకాలంలో పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో రహదారులు చిత్తడిగా మారి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారంతా నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.

జీవీఎంసీ పరిధిలోని నివాసాల నుంచి ఉత్పత్తి అవుతున్న మానవ వ్యర్థాలను సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)కు పంపించేందుకు వీలుగా భూగర్భంలో పైప్‌లైన్‌లు నిర్మించారు. వాటి ద్వారా వ్యర్థాలు ఎస్‌టీపీలకు చేరితే, అక్కడ ప్రత్యేక యంత్రాలతో శుద్ధి చేసి పర్యావరణానికి విఘాతం కలగకుండా సముద్రంలోకి విడిచిపెడతారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 1.5 లక్షల ఇళ్లకు యూజీడీ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా సమీపంలోని పంప్ హౌస్‌కు తరలించేలా ఎనిమిది జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌లోని యూజీడీ పైప్‌లైన్‌లలో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు పూడిక తీసేందుకు వీలుగా ... మిగతా 6వ పేజీలో

ఉక్కు ఉద్యోగులకు అందని జీతాలు

- 6వ తేదీ వచ్చినా జమ చేయని యాజమాన్యం
- రెండు వాయిదాల్లో కాకుండా.. ఒకేసారి చెల్లించాలని కోరుతున్న ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 6: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఆరో తేదీ వచ్చినా జూలై నెల జీతాలు అందలేదు. కొన్ని నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. గత నెలలో స్టీల్‌ప్లాంటుకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి దృష్టికి ఈ విషయాన్ని కార్మిక సంఘాల నాయకులు తీసుకువెళ్లగా, ఆ రోజు యాజమాన్యం సగం జీతం జమచేసింది. ఆ తర్వాత మిగిలిన సగం జీతాన్ని చెల్లించింది. ఈ నెల అయినా ఒకటో తేదీన జీతం వస్తుందని ఉద్యోగులంతా ఆశించారు. కానీ ఆరో తేదీ వచ్చినా యాజమాన్యం జీతాలను జమ చేయలేదు. ఈ నెల కూడా రెండు వాయిదాల్లో ఇస్తారా, లేదా ఒకేసారి చెల్లిస్తారా అన్నదానిపై స్పష్టత లేదు. కాగా పూర్తి జీతాన్ని ఒకేసారి ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఏయూలో తగ్గని ప్రసాదరెడ్డి హవా!

- రోజూ 11.45 గంటలకు హాజరు
- అంతకు ముందే రిజిస్టర్‌లో సంతకం?
- ప్రత్యేకంగా అటెండర్ సేవలు



విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ గద్దె దిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి హవా మాత్రం తగ్గలేదు. ఆయన హయాంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో వ్యతిరేక వర్గం వారు ఎవరైనా ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా...ఆబ్సెంట్ వేయించేవారు. ఇలా ఆలస్యంగా వచ్చే వారి వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేకంగా మనుషులను పెట్టుకునేవారు. ఇప్పుడు ఆయన వీసీ పదవి నుంచి దిగిపోయిన తరువాత ఫ్యాకల్టీగా అదే సీఎస్‌ఈ విభాగంలో విధులు నిర్వహించాల్సి వచ్చింది. కానీ, ఆయన అందరిలా సమయానికి రావడం లేదు. ప్రతిరోజూ ఉదయం 11.40 నుంచి 11.45 గంటల మధ్య వస్తున్నారు. అయితే ఉదయం 10 గంటలకే అన్ని విభాగాల నుంచి అటెండెన్స్ రిజిస్టర్లు ప్రిన్సిపాల్ కార్యాలయానికి వెళ్లిపోతాయి. అలా సీఎస్‌ఈ రిజిస్టర్‌ను ప్రిన్సిపాల్ కార్యాలయానికి తీసుకువెళుతున్నప్పుడు దారి మధ్యలో ఎవరో ప్రసాదరెడ్డి సంతకం పెడుతున్నారు. డిపార్టుమెంట్ నుంచి రిజిస్టర్‌ను తీసుకువెళుతున్నప్పుడు లేని సంతకం తిరిగి వచ్చేటపుడు ఎలా ఉంటుందా?...అని అంతా అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పైగా ఏ ప్రొఫెసర్‌కు వ్యక్తిగత సహాయకులను యూనివర్సిటీ ఇవ్వలేదు. ప్రసాదరెడ్డికి మాత్రం యూనివర్సిటీ టైమ్ స్కేల్ పొందుతున్న ఒక ఉద్యోగి వ్యక్తిగత సేవలు అందిస్తున్నారు. ఆయన క్యాంపస్‌కు వచ్చిన దగ్గర నుంచి వెళ్లేపోయేంత వరకు ఆయనతో పాటు ఉంటూ పుస్తకాలు మోస్తూ సేవలు అందిస్తున్నారు. తీరుబడిగా విభాగానికి వచ్చే ప్రసాదరెడ్డి ఎటువంటి క్లాసులు తీసుకోవడం లేదు. ఆయన ఇంతకు ముందు క్యాంపస్‌లో అడ్డగోలుగా నియమించిన బయటవారు వస్తుంటే...వారితో కబుర్లు చెబుతూ గదిలో కాలక్షేపం చేస్తున్నారు. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నాయా?, తెలియకుండా జరుగుతున్నాయో?...అర్థం కావడం లేదు. ప్రసాదరెడ్డి వ్యవహారాన్ని చూసి తట్టుకోలేని ఓ ఉద్యోగి మంగళవారం ఓ ఉన్నతాధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. రిజిస్టర్‌లో ఆయన సంతకాలకు బదులు వేరే వారు పెడుతున్నారని, దానిపై దృష్టి పెట్టాలని కోరారు. ఆ అధికారి తగిన చర్యలు తీసుకుంటారని భావించారు. కానీ అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. ఫిర్యాదు చేసిన సదరు ఉద్యోగిని బుధవారం నుంచి సీఎస్‌ఈ విభాగానికి వెళ్లవద్దని, ఆర్ట్స్ కాలేజీ విభాగానికి వెళ్లి కూర్చోవాలని సదరు ఉన్నతాధికారి ఆదేశించారు. ప్రభుత్వం మారినా ప్రసాదరెడ్డిపై ఈగ వాలకుండా ఉన్నతాధికారులే చూసుకుంటున్నారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌ను కొనసాగించాలి

» సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ



మాట్లాడుతున్న రమణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 6: నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ కొనసాగించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌లో తమను విలీనం చేయవద్దని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ-ఏ రిజర్వేషన్ పరిధిలో నాయీ బ్రాహ్మణ, రజక కులాలకు సంబంధించి రాష్ట్రంలో లక్షలాది జనాభా కలిగి ఉందన్నారు. ఈ కులాలు ఎంబీసీ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం యోచించడం అత్యంత బాధాకరమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కిన్నెర శ్రీనివాసులుస్వాతంత్ర్యం వచ్చిదశాబ్దాలవుతున్నా నేటి వరకు ఈ కులాలకు రాజకీయ అవకాశం కలుగలేదన్నారు. ఈ సమావేశంలో సభ్యులు బి. జగన్, టి. అప్పారావు, ఎం. రాధయ్య, బి. వెంకటరావు, ఆర్. రాముడు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి : ఎస్ఐ

సీతమ్మధార, ఆగస్టు 6: రహదారుల పక్కన టిఫిన్, కర్రిపాయింట్, నూడిల్స్ తదితర వ్యాపారాలను ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాగించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు పేర్కొన్నారు. సీతమ్మధార ప్రాంతంలో రోడ్డుపై అమ్మకాలు చేస్తున్న చిరు వ్యాపారులకు సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. తోపుడు బండ్లపై టిఫిన్ వి క్రయాలతో జనం గుమిగూడి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈస్థితిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులేకుండా చూడాలన్నారు.

పరదేశమ్మ ఆలయ కార్యవర్గం ఎన్నిక

అక్కయ్యపాలెం, ఆగస్టు 6: రైల్వేన్యూకాలనీ తాటిచెట్లపాలెం గ్రామాల ఇలవేల్పు పరదేశమ్మ అమ్మవారి ఆలయ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షునిగా బోరా రమణారెడ్డి, అధ్యక్షునిగా దాడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోరాడ సత్యశివరావు, కోశాధికారిగా జీరు శ్రీనివాసరెడ్డి, ఆడిటర్‌గా మొల్లేటి వెంకట అప్పారావు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి జిల్లా తెలుగు దేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి, 42వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. శ్రావణమాసం తొలి వారం సందర్భంగా కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



వెలంపేటలో అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు



మాట్లాడుతుఉన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర

పూర్ణామార్కెట్, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర పేర్కొన్నారు. మంగళవారం గ్రేటర్ 30 వార్డులో వెలంపేట అంగనవాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి, విప్రోకేర్, కశాల్ మెటర్నిటీ హెల్త్ ప్రాజెక్టు, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలనుద్దేశించి ఆమె మాట్లాడారు. తల్లి పాలలో రోగ నిరోధక శక్తి బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లులకు ఆరోగ్య పరిరక్షణ చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు సమన్వయకర్త టి.షర్మిల అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, దేవి, రమణమ్మ, శ్రీదేవి, భవాని, కనకమహాలక్ష్మి, ఆశా వర్కర్లు, సచివాలయ హెల్త్ సెక్రటరీ, మహిళా పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష..

డాబాగార్డెన్స్: తల్లిపాలు బిడ్డల ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. ఇందిర అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లో ఉన్న గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత, ఆవశ్యకతను ఆమెను తెలియజేశారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించడం చాలా ఆరోగ్యకరమన్నారు. తల్లిపాలలో ఉండే రోగ నిరోధక శక్తి వల్ల పిల్లల్లో వ్యాధులు దరి చేరవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

హైకోర్టును తప్పుదోవ పట్టించారు

» విలేకరుల సమావేశంలో న్యాయవాది శ్రీరామ్మూర్తి



సమావేశంలో న్యాయవాది శ్రీరామ్మూర్తి, చిరువ్యాపారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 6: హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కళాభారతి రోడ్డులోని తోపుడు బండ్లు, బడ్డీలను జీవీఎంసీ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తొలగించడం అన్యాయమని న్యాయవాది పలకా శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కళాభారతి తోపుడుబండ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగుదశాబ్దాలు ఏళ్లుగా చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వానికి ఆశీలు చెల్లిస్తున్నా రోడ్డు మార్జిన్ ఆక్రమించారని, మూర్తియాదవ్ హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తెచ్చారన్నారు. అయితే, ఆ రోడ్డులో మార్జిన్ లేదన్నారు. అలాంటప్పుడు చిరు వ్యాపారులపై మూర్తియాదవ్ హై కోర్టులో ఏ విధంగా పిటీషన్ వేశారని ప్రశ్నించారు. నోటీసులు హఠాత్తుగా చూపి దుకాణాలు తొలగించాలంటే, ఎక్కడి వెళ్లిపోతారని ఆయన ప్రశ్నించారు. తోపుడుబండ్ల సంఘం అధ్యక్షులు బన్నీ ఈశ్వరరావు మాట్లాడుతూ తాము బడ్డీలను తొలగించడం లేదని చిరువ్యాపారులు అద్దెకున్న ఇళ్ల యజమానులతో బెదిరిస్తున్నారని వాపోయారు. సంఘం కార్యదర్శి అనూష మాట్లాడుతూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించవద్దంటూ మూర్తియాదవ్ తనను ప్రలోభానికి గురిచేస్తున్నట్టు తెలిపారు. అలాగే, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ భూ కబ్జాలపై విచారణ చేయాలంటూ మూర్తి ప్రకటన విడుదల చేశారని తెలిపారు.ఈ సమావేశంలో సంఘం సభ్యులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

రెండు వారాలకు ఒకసారి జరుగుతుంది. అందువల్ల ముఖ్యమైన నిర్ణయాలన్నీ దాదాపు స్టాండింగ్ కమిటీ ఆధ్వర్యంలోనే జరిగిపోతాయి కాబట్టి దానికి ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదిపాటు పదవిలో ఉండే స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులకు అవకాశం ఉంది. వీరందరినీ జీవీఎంసీ పరిధిలోని కార్పొరేటర్లు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమి నుంచి నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మిబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (ఏడో వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెళ్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) పోటీలో ఉన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడంతో 96 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. దీని ప్రకారం ఎన్నికల్లో గెలవాలంటే ఒక్కో అభ్యర్థి కనీసం 49 ఓట్లు దక్కించుకోవాలి. కాగా ప్రస్తుతం కూటమిలో ఉన్న టీడీపీకి 36 మంది కార్పొరేటర్లు, జనసేనకు పది మంది కార్పొరేటర్లు, బీజేపీ నుంచి ఒకరు మొత్తం 47 మంది సభ్యుల బలం ఉంది. వీరితో పాటు సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కూటమికి మద్దతుగా ఓటేయాలని నిర్ణయించారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కూడా కూటమికి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరిగింది. మరో నలుగురైదుగురు బుధవారం పార్టీలో చేరి నేరుగా పోలింగ్ కేంద్రానికి వస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అవుతుందనడంలో సందేహం ఉండదు. మరోవైపు వైసీపీ బలం ప్రస్తుతం 47కి తగ్గిపోయింది. వైసీపీ కార్పొరేటర్లతో నగరంలోని ఒక హోటల్‌లో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. వారిలో నలుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వారు కూటమిలో చేరిపోతారనే ప్రచారం జరుగుతోంది.

ఇరువర్గాల్లోనూ క్రాస్‌ఓటింగ్ గుబులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి నేతలతోపాటు వైసీపీ నేతలకు క్రాస్‌ఓటింగ్ భయం వెంటాడుతోంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి కావాల్సిన కార్పొరేటర్ల బలాన్ని ప్రస్తుతం కూటమి సంపాదించినప్పటికీ, వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కనీసం ఐదుగురు తమ అభ్యర్థుల్లో నలుగురైదుగురికి అనుకూలంగా ఓటేస్తారని వైసీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా విజయానికి కావాల్సిన బలం తమకు ఉన్నప్పటికీ, వైసీపీలోని మరికొందరు కార్పొరేటర్లు తమ పార్టీల్లో చేరేందుకు ఆసక్తితో ఉన్నందున వారంతా రహస్యంగా తమ అభ్యర్థులకే ఓటేస్తారు కాబట్టి, తాము పది స్థానాలను దక్కించుకుంటామని టీడీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

ఏటా రూ.50 లక్షలతో టెండర్లు పిలుస్తుంటారు. కాంట్రాక్టరు జీవీఎంసీకి చెందిన సిబ్బంది ద్వారా ప్రతిరోజూ యూజీడీ మ్యాన్‌హోల్స్ వద్ద మూతలు తెరిచి, పూడిక తీయించి, మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగేలా పనులు చేపట్టాల్సి ఉంటుంది.

అయితే యూజీడీ పైప్‌లైన్‌లో ఎక్కడైనా పూడిక పేరుకుపోతే మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగిపోతుంది. అది రోడ్డుపైకి ప్రవహించి, చిందరవందరగా మారుతుంది. దాని నుంచి వెలువడే దుర్గంధం కారణంగా ఆ మార్గంలో ప్రయాణించేవారితోపాటు నివాసితులు నరక యాతన అనుభవించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో నగరంలో ఎక్కడైనా యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపోతే వెంటనే అక్కడికి జీవీఎంసీ సిబ్బందిని తీసుకువెళ్లి, ఫ్లెక్సీబుల్ ఇనుపరాడ్లతో మురుగునీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డు తొలగించేందుకు వీలుగా ఏటా మరో రూ.1.5 కోట్లతో నిర్వహణ పనులకు టెండర్ పిలుస్తున్నారు. అయినప్పటికీ నగరంలో ప్రతీరోజూ ఎక్కడో ఒకచోట యూజీడీ పొంగిపోయి, మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం సాధారణ అంశంగా మారిపోయింది. దీనిపై ఫిర్యాదుచేసిన మరుసటిరోజు సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే సమస్య పునరావృతమవుతోంది. దీనివల్ల నగరంలో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపోకుండా పైప్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పూడిక తీయాల్సిన కాంట్రాక్టరు ఆ పని సక్రమంగా చేయడం లేదు. జీవీఎంసీకి చెందిన సిబ్బందికే కొన్ని పరికరాలను సమకూర్చి నిత్యం యూజీడీ మ్యాన్‌హోల్స్‌ను ఒకదాని తర్వాత ఒకటి తెరిచి పూడికను తీయించాల్సి ఉండగా, ఆ పనిచేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కుబడిగా రోజుకు ఏదో ఒకచోట పూడికతీసి ఫొటోలను ఇంజనీరింగ్ అధికారులకు పంపించేస్తున్నారు. మరోవైపు యూజీడీ పొంగిపోతే సమాచారం అందిన వెంటనే జీవీఎంసీకి చెందిన సిబ్బందిని తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాల్సిన కాంట్రాక్టర్లు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లో మెయింటెనెన్స్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ప్రతి జోన్‌లోనూ పది మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులను జీవీఎంసీ సమకూర్చుతుంది. వారికి జీతాలు చెల్లిస్తుంది. మ్యాన్‌హోల్ వద్ద పూడిక తీసేందుకు అవసరమైన ఫ్లెక్సిబుల్ ఇనుపరాడ్లు, చేతిగ్లౌజ్‌లు, డెటాల్ సబ్బులు, పైప్‌లైన్ పగిలిపోతే కొత్తది ఏర్పాటుచేయడం వంటి బాధ్యతలను మాత్రమే కాంట్రాక్టర్ చూడాల్సి ఉంటుంది. దీనికోసం ఏటా రూ.1.5 కోట్లు వెచ్చిస్తోంది. యూజీడీ పొంగినట్టు వార్డు సచివాలయం లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్, అధికారుల నుంచి కాంట్రాక్టర్‌కు సమాచారం అందుతుంది. వెంటనే ఆజోన్‌లోని సిబ్బందితో తక్షణం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలి. కానీ ఫిర్యాదు అందినప్పటికీ ఒకరోజు గడిస్తేనేగానీ స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. వీరిపై పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతాలు



సామూహిక వ్రతాల్లో మహిళలు

మురళీనగర్, ఆగస్టు 6; మురళీనగర్‌లో మంగళవారం శ్రీ గౌరీ సంక్షేమ సేవా సంఘం 26వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు కేవీఎల్ నరసింహం ఆధ్వర్యంలో మంగళగౌరీ వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఎం.రమణ, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరావు అసోసియేషన్ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు. కంచరపాలెం నుంచి మురళీనగర్ వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి అనంతరం ఇక్క సామూహిక వ్రతం ఆచరించారు. దేవీ ప్రతిమల్ని బుధవారం అనుపు ఉత్సవంలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు, అతిధులు వేడుకల్లో హాజరయ్యారు.

ఆంజయేయునికి ప్రత్యేక అర్చనలు

మాధవధార; సూర్యానగర్ శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి అర్చకులు శ్రీకాంత్ సింధూర, శ్రీరామ అష్టోత్తర పూజలు చేపట్టారు. భక్తులు సామూహిక సుందరకాండ పారాయణం చేపట్టారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఉన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.

పోలమాంబకు శ్రావణ పూజలు

జగదాంబ కూడలి: గ్రేటర్ 30 వార్డు కుమ్మర వీధిలోని పోలమాంబ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తు లు ఆలయ ఎదుట బారులు తీరారు. పలువురు వ్యా పారులు గుడిలో పూజలు నిర్వహించారు.

జీవీఎంసీ స్థలం ఆక్రమణపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, ఆగస్టు 6: టర్నర్ చౌల్ట్రీలో జీవీఎంసీ స్థలం ఆక్రమణపై జోన్-4 కమిషనర్ విచారణకు ఆదేశించారు. మంగళవారం 'జీవీఎంసీ స్థలం ఆక్రమణ' శీర్షికన 'ఆం ధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. టర్నర్ చౌల్ట్రీ శివరామస్వీట్స్ మెయిన్ ఎదురుగా గల ఈ స్థలం ఆ క్రమణపై వచ్చిన కథనం 30వ వార్డు పరిధిలో చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా ఇక్కడి రస్తాను వ్యాపారి కబ్జా వెలుగులోకి తేవడంపై తాడివీధి, సాలిపేట ప్రాంత నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వినియోగించుకొనేందుకు త్వరలోనే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై అధికారిక వర్గాల్లో చర్చ సాగింది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో జోనల్ కమిషనర్ మాట్లాడారు. విచారణకు ఆదేశించారు. జీవీఎంసీ స్థలంగా నిర్ధారణ అయితే సంబంధిత వ్యాపారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయంపై అభినందనలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 6: విశాఖ ఉమ్మడి జిల్లాలో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని టీఎన్‌టీయూసీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు శ్రీకృష్ణ అన్నారు. ఈ మేరకు కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను, ఆర్థిక సాయం చేసిన వారిని అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు.

వైశాఖీ పార్కును పరిశీలించిన ఏసీపీ



పార్కుహాల్‌లో పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహమూర్తి

మురళీనగర్, ఆగస్టు 8: మురళీనగర్‌లోని వైశాఖ స్పోర్ట్సు పార్కుతోపాటు పరిసర ప్రాంతాలను మంగళవారం విశాఖ నార్త్ ఏసీపీ ఎ. నర్సింహమూర్తి, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో స్విమ్మింగ్‌పూల్, వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్ వద్ద భద్రత, రాత్రి వేళ గస్తీ అంశాలను పార్కు కమిటీ అధ్యక్షుడు ననపల.వరప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడి స్విమ్మింగ్ పూల్‌లో వాచ్‌మెన్ ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. అలాగే, రాత్రి వేళలో గంజాయి బ్యాచ్ చేరి పార్కుకు వచ్చే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం తదితర సంఘటనలు చేసుకున్నా యి. ఈనేపథ్యంలోపార్కు కమిటీ సభ్యుల వినతి మేరకు ఏసీపీ సహా కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి పార్కు సందర్శించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం, ఆగస్టు 6 : జిల్లాలోని వివిధ ప్రైవేటు/ ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడతలో మిగిలిన సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్‌నకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందన్నారు. విశాఖ జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐలతోపాటు 30 ప్రైవేటు ఐటీఐలకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులుసమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా చేసిన వారిని మాత్రమే కౌన్సెలింగ్‌నకు అనుమతిస్తారు. ఆగస్టు 29వ తేదీన ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు, 31న ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీంతోపాటు ఎఎస్ఆర్ జిల్లా గడుగుపల్లి (నరవ) ప్రభుత్వ ఐటీఐ, ప్రస్తుతం కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నడుస్తున్న ఐటీఐలకు దరఖాస్తు చేయొచ్చు

పారిస్ విశ్వ క్రీడా వేదికపై నేడు విశాఖ యువతి ప్రదర్శన

... 5వ పేజీ తరువాయి

శుక్రవారం (9న) సెమీ ఫైనల్స్ శనివారం (10న) ఫైనల్ రేస్ జరుగుతుంది.

ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి

అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు

ఆమెకు ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తా ఉంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించిన నేపథ్యంలో ఆమెపై అంచనాలు పెరిగాయి. నెలకొల్పిన జాతీయ రికార్డులు, సాధించిన అంతర్జాతీయ పతకాలు ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో క్వాలిఫై అవుతుందనే నమ్మకం ఉంది. అలాగే ఫైనల్స్‌కు చేరే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్న తరువాత గోవింద్ పేరు ఖరారు చేసినట్టు తెలిసింది.

టీడీపీ కార్యాలయానికి ఏజెన్సీ వైసీపీ ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మంగళవారం విశాఖలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. తాము పార్టీ మారుతామని, తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులను కోరారు. అలాగే మరికొంత మందినాయకులు బుధవారంవస్తారని సమాచారం.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. వారి నిధులను దారిమళ్లించిం ది. దాంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వ అధికారాలు కట్టబెట్టడంతో పాటు 'నీరు-చెట్టు' పథకం కింద నిధులు పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆయా నిధులతో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి కూటమితో కలసి నడవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా స్వచ్ఛందంగా ముందుకువచ్చే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కూటమి నాయకత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు బుధవారం నుంచి పార్టీలో చేరికలు ప్రారంభమవుతాయని టీడీపీ నేతల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కూటమి చేతిలో 250 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 486 ఓట్లు రావాలని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా కూటమే గెలుచుకుంటుందని70 ఓట్ల మెజారిటీ కూడా సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి 615, కూటమికి 218 ఓట్లు ఉన్నాయి. ఏజెన్సీలో వామపక్షాలకు 18 ఓట్లు ఉన్నాయి. వారు కూటమితో చెలిమికి అంగీకరించారు.

సమస్యల వలయంలో గ్రంథాలయం

కనీస వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్న పాఠకులు

చదివేందుకు సరైన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదని ఆవేదన

నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడు నెలలైనా కదలని పనులు

పెదగంట్యాడ, ఆగస్టు 6: సమస్యల వలయంలో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయం కొట్టుమిట్టాడుతోంది. గ్రంథాలయాలకు ఉండాల్సిన వసతులేవీ దీనికి లేవు. పుస్తకాలను భద్రపరిచేందుకు గది లేదు. పాఠకులు వచ్చి చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు కూడా చాలావరకు అందుబాటులో లేవు. పాఠకులు కూర్చునేందుకు అవసరమైనన్ని బెంచీలు కానరావు. లైబ్రరీతో పాటు మరుగుదొడ్ల సముదాయానికి నీటి సౌకర్యం లేదు. ఇలా అనేక సమస్యలు శాఖా గ్రంథాలయాన్ని వెంటాడుతుండడంతో పాఠకులతో పాటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని పరిష్కరించేందుకు జీవీఎంసీ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వాహకులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని పలువురు పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సగం కూలిన గ్రంథాలయ అదనపు భవనం



మూలకు చేరిన బోరింగ్

శిథిలమైన అదనపు భవనం

గ్రంథాలయానికి ఉన్న అద నపు భవనం శిథిలమవ్వడంతో దానిని పునరుద్ధరించేందుకు గాను జిల్లా గ్రంథాలయ సంస్థ అందులోని పుస్తకాలను వేరే ప్రైవేటు గదిలోకి తరలించింది. అనంతరం శిథిల భవనాన్ని కొంతవరకు తొలగించింది. ఇది జరిగి ఏడాదైనా పునరుద్ధరణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఉన్న ఒక్క గదే గ్రంథాలయంగా కొనసాగుతుంది. తొలగించిన భవనంలోని ఫర్నీచర్‌ను ఈ గదిలోనే సర్దుబాటు చేశారు. దీంతో పాఠకులు వచ్చి ప్రశాంతంగా కూర్చుని చదువుకునేందుకు వీల్లేకుండా పోతుంది. పుస్తకాలను కట్టలుగా కట్టి వేరే ప్రైవేటు గదిలో భద్రపరచడంతో అవి పాఠకులకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రస్తుతం పాఠకులు చదివేందుకు దినపత్రికలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి.

మూలకు చేరిన బోరు..

గ్రంథాలయానికి, దానికి ఆనుకుని ఉన్న మరుగుదొడ్ల సముదాయానికి నీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరింగ్ ఏడాదిన్నర క్రితమే పాడైపోయింది. దీనికి ఉన్న పైపులైన్లు ఎక్కడికక్కడ విరిగిపోయాయి. నీటిని నిల్వ చేసేందుకు ఏర్పాటు చేసిన ట్యాంకు పగిలిపోయింది. ఇలా అన్ని విధాల గ్రంథాలయాన్ని సమస్యలు చుట్టుముట్టాయి. అద్దె గదిలో ఉన్న పుస్తకాల పరిస్థితి ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఎన్ని పుస్తకాలు ఉన్నాయో.. ఎన్నింటికీ చెదలు పట్టి పాడైపోయాయో అంతుచిక్కడం లేదు.

శంకుస్థాపన చేసి మూడు నెలలైనా..

ఇక్కడి శాఖా గ్రంథాలయానికి రూ.35 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించేందుకు మూడు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ అధికారులు దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడంతో పాటు మూడు నెలల్లో భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. దీంతో గ్రంథాలయానికి విచ్చే పాఠకులు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ సంస్థ, జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పలువురు పాఠకులు కోరుతున్నారు.



పాడైపోయిన వాటర్ ట్యాంక్



విద్యార్థినిని అభినందిస్తున్న ఏసీపీ శ్యామలరావు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జోన్-2 క్రైమ్ ఏసీపీ శ్యామలరావు

పెందుర్తి, ఆగస్టు 6: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అందువల్ల విద్యార్థులంతా వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జోన్-2 క్రైమ్ ఏసీపీ శ్యామలరావు సూచించారు. పెందుర్తి క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఆళ్వార్‌దాస్ కళాశాలలో మంగళవారం నేరాలు-నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తప్పుడు లింకులు పంపిస్తూ మనకు తెలియకుండానే బ్యాంకు ఖాతాల నుంచి నగదు కాజేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో పెట్టే ఫొటోలకు మార్ఫింగ్ చేసి కొంతమంది ఆకతాయిలు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అందువల్ల యువతలు జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత మద్యం, గంజాయి మత్తుకు బానిసలు కాకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని శ్యామలరావు ఆకాంక్షించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వెస్ట్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

అగనంపూడి, ఆగస్టు 6: హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ టీడీపీ నాయకులు స్థానికంగా గల ఎన్టీ రామారావు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచం నలు మూలలా చాటిచెప్పిన ఎన్టీఆర్ పేరుతో ఉన్న హెల్త్ యూనివర్సిటీ పేరును గత వైసీపీ ప్రభుత్వం మార్పు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు గంతకోరు అప్పారావు, బి.సత్యనారాయణ, డి.రమేశ్. పి.అచ్యుత్, బి.హనుమంతరావు, ఎస్.సింహాచలం, వి.సూర్యనారాయణ, టి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ఉచిత క్యాన్సర్ స్కానింగ్ శిబిరం ప్రారంభం



క్యాన్సర్ స్కానింగ్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వందన ఖత్రీ

మల్కాపురం, ఆగస్టు 6: హిందుస్థాన్ షిప్‌యార్డు, మహాత్మాగాంధీ ఆస్పత్రి సంయుక్తంగా మంగళవారం షిప్‌యార్డు కాలనీలో మెగా ఉచిత క్యాన్సర్ స్కానింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని షిప్‌యార్డు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రీ సతీమణి షిప్‌యార్డు మహిళా క్లబ్ చైర్‌పర్సన్ వందన ఖత్రీ ప్రారంభించి మాట్లాడారు. షిప్‌యార్డు యాజమాన్యం స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. భారత అవయవ దాన దినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అవయవ దానంతో మరొకరికి ప్రాణ దానం చేసిన వారవుతామన్నారు. కార్యక్రమంలో పలువురు షిప్‌యార్డు ఉద్యోగులు, మహిళా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

పెందుర్తి, ఆగస్టు 6: మండలంలో గల రాంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం వెన్నెల అప్పలనాయుడు, ఎర్రినాయుడు సొంత నిధులతో సమకూర్చిన నోటు పుస్తకాలను మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీదేవిగా బొర్రమాంబ



అగనంపూడి, ఆగస్టు 6: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఇలవేల్పు బొర్రమాంబ ఆలయంలో శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని గౌరీదేవిగా అలంకరించగా పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో అద్భుతాలు ఆవిష్కరణ

పెందుర్తి, ఆగస్టు 6: సృజనతో, కొత్త ఆలోచనలతో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని విశాఖ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు అన్నారు. ఇక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఐవోటీ అండ్ సెన్సార్స్ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులంతా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, మోడరన్ ఇంటర్నెట్ టెక్నాలజీపై శోధన చేయాలన్నారు. అనంతరం నారాయణరావుకు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది సూర్యస్వరూప్, శేషసాయిమూర్తి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ చొరవతో వితంతు మహిళకు పింఛన్

ఇల్లు, ఉపాధి కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఆగస్టు 6: తనకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఓ వితంతు మహిళ పెట్టుకున్న అర్జీపై ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పందించి తగిన చర్యలు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన ఆర్.శ్రావణికి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమవ్వగా, ఇద్దరు పిల్లలు జన్మించారు. అయితే ఆమె భర్త మృతి చెందడంతో అత్తింటివారు ఆదరించకపోవడంతో తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి నిమిత్తం కొన్నాళ్ల క్రితం పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురానికి వలస వచ్చారు. శ్రావణికి సొంత ఇల్లు, వితంతు పింఛన్, ఉపాధి లేకపోవడంతో పిల్లలతో జీవనం సాగించడం కష్టతరంగా మారింది. దీంతో పవన్‌కల్యాణ్ నిర్వహిస్తోన్న ప్రజా దర్బార్‌కు ఆమె హాజరై తన సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని సమర్పించింది. ఆమె సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ పవన్‌కల్యాణ్ సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్లను ఆదేశించారు. ఈ మేరకు శ్రావణి కుటుంబాన్ని పంచకర్ల కలిసి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌ను ఫోన్ చేసి శ్రావణికి ఇంటి స్థలం, వితంతు పింఛన్ అందించడంతో పాటు అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పించాలని ఆదేశించారు. తన సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన పవన్‌కల్యాణ్, పంచకర్ల రమేశ్‌బాబులకు శ్రావణితో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రావణితో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కు సమస్యకు పరిష్కారం

ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవల్లి నాగభూషణం

కూర్మన్నపాలెం, ఆగస్టు 6: స్టీల్‌ప్లాంట్ సమస్యల తక్షణ పరిష్కారానికి సెయిల్‌లో విలీనం చేయాలని ఇంటక్ రాష్ట్ర కార్యదర్శి భోగవల్లి నాగభూషణం అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,273వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలకు హాని తల పెట్టిన పార్టీలకు మనుగడ లేదన్నారు. ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రి వచ్చి సానుకూలంగా స్పందించినందున ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్న కేంద్ర ప్రకటన కోసం కార్మికులంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు కేంద్రం ప్రకటించేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని నాగభూషణం స్పష్టం చేశారు.

పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో పూర్తి స్థాయి ఉత్పత్తికి కేంద్రం సహకరించాలని, ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ఉపసంహరించుకునేలా చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. జాతీయ సంపదైన స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ స్థాపించినప్పటి నుంచి రూ.ఆరు వేల కోట్లు నికర లాభంలో ఉండేదని, కేంద్రానికి సుమారు రూ.45 కోట్లు పైబడి, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.తొమ్మిది వేల కోట్లను డివిడెండ్ల రూపంలో లాభాలను ప్లాంట్ అందించిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని విడనాడి స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కొవిరి అవతారం, గంగవరం గోపి, రాజు, సుబ్బయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో భోగవల్లి నాగభూషణం, మంత్రి రాజశేఖర్, తదితరులు




కణితి హై స్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న 'లయన్స్' సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాంతి స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలి

కూర్మన్నపాలెం, ఆగస్టు 6: మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడుస్తూ శాంతి స్థాపనకు విద్యార్థులు కృషి చేయాలనీ లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి అన్నారు. 87వ వార్డు పరిధిలోని కణితి హైస్కూల్లో మంగళవారం హిరోషిమా డేను పురస్కరించుకుని 52వ శాంతి స్మృతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేడు జపాన్ దేశం హిరోషిమాపై అణుబాంబులు ప్రయోగించి ప్రపంచ శాంతికి విఘాతం కలిగించిన రోజన్నారు. అణ్వాయుధాల కారణంగా నేటికీ మానవాళికి సుఖసంతోషాలు లేవన్నారు. నాటి విధ్వంసాలకు వ్యతిరేఖంగా శాంతి ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నామన్నారు. స్కూల్ హెచ్ఎం బి.సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గాంధీజీ అస్త్రాలైన శాంతి, సత్యం, అహింస మార్గాలలో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్నాజీ, రామశేషు, అప్పారావు, లయన్స్ క్లబ్ సభ్యులు కేవీ సుబ్బరాజు, అవిరెడ్డి సూర్యనారాయణ, ప్రసాద్‌నాయుడు, లక్ష్మారెడ్డి, కేవీ ప్రసాద్, శ్రీనివాసరావు, బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రమశిక్షణతో విద్యా బోధన చేయాలి



భవిత కేంద్రంలోని విద్యార్థితో మాట్లాడుతున్న అధికారులు

మల్కాపురం, ఆగస్టు 6: స్థానిక జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర సహాయ సహిత విద్యా కో-ఆర్డినేటర్ అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ బి.గీత సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కేంద్రంలోని పిల్లలకు క్రమశిక్షణతో విద్యా బోధన చేయాలని సిబ్బందికి సూచించారు. పిల్లలను ఉత్సాహపరిచే విధానం, వారు తరగతిలో కూర్చొనే తీరు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం టీఎల్ఎం యాక్టివిటీ కార్డులు, ఫిజియోథెరపీ సామగ్రిని పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు త్రినాథరావు, వెంకటరావు, ప్రధానోపాధ్యాయుడు పెద్దాడ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'వందేభారత్'కు సామర్లకోట స్టేషన్‌లో హాల్ట్ కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 6: విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833/20834) రైళ్లకు సామర్లకోట స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా కల్పించిన హాల్ట్‌ను ఈనెల మూడు నుంచి మరో ఆరు నెలలపాటు కొనసాగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్

చెన్నై డివిజన్‌లో పవర్ బ్లాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో అలెప్పీ నుంచి ధన్‌బాద్ వెళ్లే 13352 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పొడనూర్, ఇరుగూర్, సూరత్‌కల్ మీదుగా నడుస్తుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలుకు కోయంబత్తూర్ స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్ట్ ఎత్తివేసిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయంగా పొడనూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

60వ వార్డులో తీవ్ర జ్వరంతో వృద్ధురాలి మృతి

మల్కాపురం, ఆగస్టు 6: గ్రేటర్ 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీ-1కు చెందిన కర్రి భవానీ (65) అనే వృద్ధురాలు తీవ్ర జ్వరంతో మృతి చెందింది. ఆమెకు తీవ్రమైన జ్వరం రావడంతో ప్లేట్‌లెట్స్ పడిపోయి మృతి చెందడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ఇక్కడకు వచ్చి వృద్ధురాలి మృతిపై ఆరా తీశారు. ఇక్కడి పరిసరాలను శుభ్రం చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

వేపగుంట, ఆగస్టు 6: ఇక్కడి ప్రహ్లాదపురంలో తల్లిదండ్రులతో నివసిస్తున్న యువతి అదృశ్యమవ్వడంపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రహ్లాదపురంలో ఉంటున్న జి.సింహాచలం రెండో కుమార్తె గంగా వైజయంతి (22) డిగ్రీ వరకు చదివింది. ఆమె తరచూ ఫోన్ మాట్లాడుతూ ఉండేదని సమాచారం. జూలై 30వ తేదీ ఉదయం తొమ్మిదిన్నరప్పుడు ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

70వ వార్డులో దోమల నివారణకు చర్యలు



దోమల మందు చల్లుతున్న దృశ్యం

ఆటోనగర్, ఆగస్టు 6: వర్షాకాలం, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీలు, మురుగు కాలువల నుంచి వృద్ధి చెందుతున్న దోమల నివారణకు జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం 70వ వార్డు పరిధి టీవీఎన్ కాలనీ, తదితర ప్రాంతాల్లోని మురుగు నీటి నిల్వలు, ఇంటి ఆవరణల్లో దోమల వ్యాప్తికి కారణమవుతున్న ప్రదేశాలను గుర్తించి క్రిమి సంహారక మందును పిచికారీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎవరికైనా మలేరియా జ్వరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సుమారు 530 ఇళ్లల్లో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది సీర వెంకటకృష్ణ, పి.రామలక్ష్మి, దుర్గ, మదీనా, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలపై గర్భిణులకు అవగాహన

గోపాలపట్నం, ఆగస్టు 6: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా నరవలోని బెహరా నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిందుమతి మాట్లాడుతూ గర్భిణులు ప్రసవించాక బిడ్డలకు విధిగా తల్లి పాలు తాగించాలని సూచించారు. నవజాత శిశువులకు కనీసం ఆరు నెలల పాటు తల్లి పాలు తాగిస్తే వారికి వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే లక్ష్మీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాలపై గర్భిణులకు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లి పాలను బిడ్డలకు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లి పాలే నవజాత శిశువులకు పౌష్టికాహారమని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడీ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 26, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 58, బెండకాయలు 22, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 32, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 54, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 30, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 75
ఫారం ధర	-- 95
విత్ స్కిన్	-- 160
స్కిన్‌లెస్	-- 170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌ను కొనసాగించాలి

▸ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ


మాట్లాడుతున్న రమణ

డాబాగార్డెన్స్, ఆగస్టు 6: నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ కొనసాగించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌లో తమను విలీనం చేయవద్దని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ-ఎ రిజర్వేషన్ పరిధిలో నాయీ బ్రాహ్మణ, రజక కులాలకు సంబంధించి రాష్ట్రంలో లక్షలాది జనాభా కలిగి ఉందన్నారు. ఈ కులాలు ఎంబీసీ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం యోచించడం అత్యంత బాధాకరమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కిన్నెర శ్రీనివాసులుస్వాతంత్ర్యం వచ్చిదశాబ్దాలవుతున్నా నేటి వరకు ఈ కులాలకు రాజకీయ అవకాశం కలుగలేదన్నారు. ఈ సమావేశంలో సభ్యులు బి. జగన్, టి. అప్పారావు, ఎం. రాధయ్య, బి. వెంకటరావు, ఆర్. రాముడు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి : ఎస్‌ఐ

సీతమ్మధార, ఆగస్టు 6: రహదారుల పక్కన టిఫిన్, కర్రీపాయింట్, నూడిల్స్ తదితర వ్యాపారాలను ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సాగించాలని ద్వారకా పోలీసు స్టేషన్ ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు పేర్కొన్నారు. సీతమ్మధార ప్రాంతంలో రోడ్డుపై అమ్మకాలు చేస్తున్న చిరు వ్యాపారులకు సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. తోపుడు బండ్లపై టిఫిన్ వి క్రయాలతో జనం గుమిగూడి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈస్థితిలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులేకుండా చూడాలన్నారు.

పరదేశమ్మ ఆలయ కార్యవర్గం ఎన్నిక

అక్కయ్యపాలెం, ఆగస్టు 6: రైల్వేన్యూకాలనీ తాటిచెట్లపాలెం గ్రామాల ఇలవేల్పు పరదేశమ్మ అమ్మవారి ఆలయ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షునిగా బోరా రమణారెడ్డి, అధ్యక్షునిగా దాడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోరాడ సత్యశివరావు, కోశాధికారిగా జీరు శ్రీనివాసరెడ్డి, ఆడిటర్‌గా మొల్లేటి వెంకట అప్పారావు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి జిల్లా తెలుగు దేశం పార్టీ మీడియా కోఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి, 42వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. శ్రావణమాసం తొలి వారం సందర్భంగా కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


వెలంపేటలో అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు


మాట్లాడుతుఉన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర

పూర్ణామార్కెట్, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర పేర్కొన్నారు. మంగళవారం గ్రేటర్ 30 వార్డులో వెలంపేట అంగనవాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి, విప్రోకేర్, కశాల్ మెటర్నిటీ హెల్త్ ప్రాజెక్టు, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలనుద్దేశించి ఆమె మాట్లాడారు. తల్లి పాలలో రోగ నిరోధక శక్తి బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లులకు ఆరోగ్య పరిరక్షణ చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు సమన్వయకర్త టి.షర్మిల అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, దేవి, రమణమ్మ, శ్రీదేవి, భవాని, కనకమహాలక్ష్మి, ఆశా వర్కర్లు, సచివాలయ హెల్త్ సెక్రటరీ, మహిళా పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష..

డాబాగార్డెన్స్: తల్లిపాలు బిడ్డల ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. ఇందిర అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లో ఉన్న గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత, ఆవశ్యకతను ఆమెను తెలియజేశారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించడం చాలా ఆరోగ్యకరమన్నారు. తల్లిపాలలో ఉండే రోగ నిరోధక శక్తి వల్ల పిల్లల్లో వ్యాధులు దరి చేరవన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

హైకోర్టును తప్పుదోవ పట్టించారు

▸ విలేకరుల సమావేశంలో న్యాయవాది శ్రీరామ్మూర్తి


సమావేశంలో న్యాయవాది శ్రీరామ్మూర్తి, చిరువ్యాపారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 6: హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కళాభారతి రోడ్డులోని తోపుడు బండ్లు, బడ్డీలను జీవీఎంసీ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తొలగించడం అన్యాయమని న్యాయవాది పలకా శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కళాభారతి తోపుడుబండ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగుదశాబ్దాలు ఏళ్లుగా చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వానికి ఆశీలు చెల్లిస్తున్నా రోడ్డు మార్జిన్ ఆక్రమించారని, మూర్తియాదవ్ హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తెచ్చారన్నారు. అయితే, ఆ రోడ్డులో మార్జిన్ లేదన్నారు. అలాంటప్పుడు చిరు వ్యాపారులపై మూర్తియాదవ్ హై కోర్టులో ఏ విధంగా పిటీషన్ వేశారని ప్రశ్నించారు. నోటీసులు హఠాత్తుగా చూపి దుకాణాలు తొలగించాలంటే, ఎక్కడి వెళ్లిపోతారని ఆయన ప్రశ్నించారు. తోపుడుబండ్ల సంఘం అధ్యక్షులు బన్నీ ఈశ్వరరావు మాట్లాడుతూ తాము బడ్డీలను తొలగించడం లేదని చిరువ్యాపారులు అద్దెకున్న ఇళ్ల యజమానులతో బెదిరిస్తున్నారని వాపోయారు. సంఘం కార్యదర్శి అనూష మాట్లాడుతూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించవద్దంటూ మూర్తియాదవ్ తనను ప్రలోభానికి గురిచేస్తున్నట్టు తెలిపారు. అలాగే, ఈ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీ భూ కబ్జాలపై విచారణ చేయాలంటూ మూర్తి ప్రకటన విడుదల చేశారని తెలిపారు.ఈ సమావేశంలో సంఘం సభ్యులు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

రెండు వారాలకు ఒకసారి జరుగుతుంది. అందువల్ల ముఖ్యమైన నిర్ణయాలన్నీ దాదాపు స్టాండింగ్ కమిటీ ఆధ్వర్యంలోనే జరిగిపోతాయి కాబట్టి దానికి ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదిపాటు పదవిలో ఉండే స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులకు అవకాశం ఉంది. వీరందరినీ జీవీఎంసీ పరిధిలోని కార్పొరేటర్లు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమి నుంచి నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మిబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (ఏడో వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెళ్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) పోటీలో ఉన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడంతో 96 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. దీని ప్రకారం ఎన్నికల్లో గెలవాలంటే ఒక్కో అభ్యర్థి కనీసం 49 ఓట్లు దక్కించుకోవాలి. కాగా ప్రస్తుతం కూటమిలో ఉన్న టీడీపీకి 36 మంది కార్పొరేటర్లు, జనసేనకు పది మంది కార్పొరేటర్లు, బీజేపీ నుంచి ఒకరు మొత్తం 47 మంది సభ్యుల బలం ఉంది. వీరితో పాటు సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కూటమికి మద్దతుగా ఓటేయాలని నిర్ణయించారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కూడా కూటమికి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరిగింది. మరో నలుగురైదుగురు బుధవారం పార్టీలో చేరి నేరుగా పోలింగ్ కేంద్రానికి వస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అవుతుందనడంలో సందేహం ఉండదు. మరోవైపు వైసీపీ బలం ప్రస్తుతం 47కి తగ్గిపోయింది. వైసీపీ కార్పొరేటర్లతో నగరంలోని ఒక హోటల్‌లో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. వారిలో నలుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వారు కూటమిలో చేరిపోతారనే ప్రచారం జరుగుతోంది.

ఇరువర్గాల్లోనూ క్రాస్‌ఓటింగ్ గుబులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి నేతలతోపాటు వైసీపీ నేతలకు క్రాస్‌ఓటింగ్ భయం వెంటాడుతోంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి కావాల్సిన కార్పొరేటర్ల బలాన్ని ప్రస్తుతం కూటమి సంపాదించినప్పటికీ, వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కనీసం ఐదుగురు తమ అభ్యర్థుల్లో నలుగురైదుగురికి అనుకూలంగా ఓటేస్తారని వైసీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా విజయానికి కావాల్సిన బలం తమకు ఉన్నప్పటికీ, వైసీపీలోని మరికొందరు కార్పొరేటర్లు తమ పార్టీల్లో చేరేందుకు ఆసక్తితో ఉన్నందున వారంతా రహస్యంగా తమ అభ్యర్థులకే ఓటేస్తారు కాబట్టి, తాము పది స్థానాలను దక్కించుకుంటామని టీడీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

యూజీడీ నిర్వహణ అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి

ఏటా రూ.50 లక్షలతో టెండర్లు పిలుస్తుంటారు. కాంట్రాక్టరు జీవీఎంసీకి చెందిన సిబ్బంది ద్వారా ప్రతిరోజూ యూజీడీ మ్యాన్‌హోల్స్ వద్ద మూతలు తెరిచి, పూడిక తీయించి, మురుగునీటి ప్రవాహం సాఫీగా జరిగేలా పనులు చేపట్టాల్సి ఉంటుంది.

అయితే యూజీడీ పైప్‌లైన్‌లో ఎక్కడైనా పూడిక పేరుకుపోతే మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగిపోతుంది. అది రోడ్డుపైకి ప్రవహించి, చిందరవందరగా మారుతుంది. దాని నుంచి వెలువడే దుర్గంధం కారణంగా ఆ మార్గంలో ప్రయాణించేవారితోపాటు నివాసితులు నరక యాతన అనుభవించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో నగరంలో ఎక్కడైనా యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపోతే వెంటనే అక్కడికి జీవీఎంసీ సిబ్బందిని తీసుకువెళ్లి, ఫ్లెక్సీబుల్ ఇనుపరాడ్లతో మురుగునీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డు తొలగించేందుకు వీలుగా ఏటా మరో రూ.1.5 కోట్లతో నిర్వహణ పనులకు టెండర్ పిలుస్తున్నారు. అయినప్పటికీ నగరంలో ప్రతీరోజూ ఎక్కడో ఒకచోట యూజీడీ పొంగిపోయి, మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం సాధారణ అంశంగా మారిపోయింది. దీనిపై ఫిర్యాదుచేసిన మరుసటిరోజు సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే సమస్య పునరావృతమవుతోంది. దీనివల్ల నగరంలో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపోకుండా పైప్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పూడిక తీయాల్సిన కాంట్రాక్టరు ఆ పని సక్రమంగా చేయడం లేదు. జీవీఎంసీకి చెందిన సిబ్బందికే కొన్ని పరికరాలను సమకూర్చి నిత్యం యూజీడీ మ్యాన్‌హోల్స్‌ను ఒకదాని తర్వాత ఒకటి తెరిచి పూడికను తీయించాల్సి ఉండగా, ఆ పనిచేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కుబడిగా రోజుకు ఏదో ఒకచోట పూడికతీసి ఫొటోలను ఇంజనీరింగ్ అధికారులకు పంపించేస్తున్నారు. మరోవైపు యూజీడీ పొంగిపోతే సమాచారం అందిన వెంటనే జీవీఎంసీకి చెందిన సిబ్బందిని తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాల్సిన కాంట్రాక్టర్లు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూజీడీ మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లో మెయింటెనెన్స్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ప్రతి జోన్‌లోనూ పది మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులను జీవీఎంసీ సమకూర్చుతుంది. వారికి జీతాలు చెల్లిస్తుంది. మ్యాన్‌హోల్ వద్ద పూడిక తీసేందుకు అవసరమైన ఫ్లెక్సిబుల్ ఇనుపరాడ్లు, చేతిగ్లౌజ్‌లు, డెటాల్ సబ్బులు, పైప్‌లైన్ పగిలిపోతే కొత్తది ఏర్పాటుచేయడం వంటి బాధ్యతలను మాత్రమే కాంట్రాక్టర్ చూడాల్సి ఉంటుంది. దీనికోసం ఏటా రూ.1.5 కోట్లు వెచ్చిస్తోంది. యూజీడీ పొంగినట్టు వార్డు సచివాలయం లేదా వర్క్ ఇన్‌స్పెక్టర్, అధికారుల నుంచి కాంట్రాక్టర్‌కు సమాచారం అందుతుంది. వెంటనే ఆజోన్‌లోని సిబ్బందితో తక్షణం సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలి. కానీ ఫిర్యాదు అందినప్పటికీ ఒకరోజు గడిస్తేనేగానీ స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. వీరిపై పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతాలు


సామూహిక వ్రతాల్లో మహిళలు

మురళీనగర్, ఆగస్టు 6; మురళీనగర్‌లో మంగళవారం శ్రీ గౌరీ సంక్షేమ సేవా సంఘం 26వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు కేవీఎల్ నరసింహం ఆధ్వర్యంలో మంగళగౌరీ వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఎం.రమణ, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరావు అసోసియేషన్ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు. కంచరపాలెం నుంచి మురళీనగర్ వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి అనంతరం ఇక్కడ సామూహిక వ్రతం ఆచరించారు. దేవీ ప్రతిమల్ని బుధవారం అనుపు ఉత్సవంలో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు, అతిథులు వేడుకల్లో హాజరయ్యారు.

ఆంజయేయునికి ప్రత్యేక అర్చనలు

మాధవధార; సూర్యానగర్ శ్రీ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి అర్చకులు శ్రీకాంత్ సింధూర, శ్రీరామ అష్టోత్తర పూజలు చేపట్టారు. భక్తులు సామూహిక సుందరకాండ పారాయణం చేపట్టారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, కమిటీ సభ్యులు ఉన్నారు. పరిసర ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.

పోలమాంబకు శ్రావణ పూజలు

జగదాంబ కూడలి: గ్రేటర్ 30 వార్డు కుమ్మర వీధిలోని పోలమాంబ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్త లు ఆలయ ఎదుట బారులు తీరారు. పలువురు వ్యా పారులు గుడిలో పూజలు నిర్వహించారు.

జీవీఎంసీ స్థలం ఆక్రమణపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, ఆగస్టు 6: టర్నర్ చౌల్ట్రీలో జీవీఎంసీ స్థలం ఆక్రమణపై జోన్-4 కమిషనర్ విచారణకు ఆదేశించారు. మంగళవారం 'జీవీఎంసీ స్థలం ఆక్రమణ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. టర్నర్ చౌల్ట్రీ శివరామస్వీట్స్ మెయిన్ ఎదురుగా గల ఈ స్థలం ఆ క్రమణపై వచ్చిన కథనం 30వ వార్డు పరిధిలో చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా ఇక్కడి రస్తాను వ్యాపారి కబ్జా వెలుగులోకి తేవడంపై తాడివీధి, సాలిపేట ప్రాంత నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి వినియోగించుకొనేందుకు త్వరలోనే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై అధికారిక వర్గాల్లో చర్చ సాగింది. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో జోనల్ కమిషనర్ మాట్లాడారు. విచారణకు ఆదేశించారు. జీవీఎంసీ స్థలంగా నిర్ధారణ అయితే సంబంధిత వ్యాపారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సాయంపై అభినందనలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 6: విశాఖ ఉమ్మడి జిల్లాలో కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని టీఎన్‌టీయూసీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు శ్రీకృష్ణ అన్నారు. ఈ మేరకు కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను, ఆర్థిక సాయం చేసిన వారిని అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు.

వైశాఖీ పార్కును పరిశీలించిన ఏసీపీ


పార్కుహాల్‌లో పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహమూర్తి

మురళీనగర్, ఆగస్టు 8: మురళీనగర్‌లోని వైశాఖ స్పోర్ట్సు పార్కుతోపాటు పరిసర ప్రాంతాలను మంగళవారం విశాఖ నార్త్ ఏసీపీ ఎ. నర్సింహమూర్తి, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో స్విమ్మింగ్‌పూల్, వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్ వద్ద భద్రత, రాత్రి వేళ గస్తీ అంశాలను పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల.వరప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడి స్విమ్మింగ్ పూల్‌లో వాచ్‌మెన్ ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. అలాగే, రాత్రి వేళలో గంజాయి బ్యాచ్ చేరి పార్కుకు వచ్చే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం తదితర సంఘటనలు చేసుకున్నా యి. ఈనేపథ్యంలోపార్కు కమిటీ సభ్యుల వినతి మేరకు ఏసీపీ సహా కంచరపాలెం ఎస్‌ఐ దివ్యభారతి పార్కు సందర్శించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం, ఆగస్టు 6 : జిల్లాలోని వివిధ ప్రైవేటు/ ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడతలో మిగిలిన సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్‌నకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 26వ తేదీ వరకు గడువు ఉందన్నారు. విశాఖ జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐలతోపాటు 30 ప్రైవేటు ఐటీఐలకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అభ్యర్థులుసమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా చేసిన వారిని మాత్రమే కౌన్సెలింగ్‌నకు అనుమతిస్తారు. ఆగస్టు 29వ తేదీన ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు, 31న ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీంతోపాటు ఎఎస్‌ఆర్ జిల్లా గడుగుపల్లి (నరవ) ప్రభుత్వ ఐటీఐ, ప్రస్తుతం కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నడుస్తున్న ఐటీఐలకు దరఖాస్తు చేయొచ్చు

పారిస్ విశ్వ క్రీడా వేదికపై నేడు విశాఖ యువతి ప్రదర్శన

... 5వ పేజీ తరువాయి

శుక్రవారం (9న) సెమీ ఫైనల్స్, శనివారం (10న) ఫైనల్ రేస్ జరుగుతుంది.

ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి

అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు

ఆమెకు ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తా ఉంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించిన నేపథ్యంలో ఆమెపై అంచనాలు పెరిగాయి. నెలకొల్పిన జాతీయ రికార్డులు, సాధించిన అంతర్జాతీయ పతకాలు ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో క్వాలిఫై అవుతుందనే నమ్మకం ఉంది. అలాగే ఫైనల్స్‌కు చేరే అవకాశాలున్నాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

... 5వ పేజీ తరువాయి

తెలుసుకున్న తరువాత గోవింద్ పేరు ఖరారు చేసినట్టు తెలిసింది.

టీడీపీ కార్యాలయానికి ఏజెన్సీ వైసీపీ ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మంగళవారం విశాఖలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. తాము పార్టీ మారుతామని, తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులను కోరారు. అలాగే మరికొంత మందినాయకులు బుధవారంవస్తారని సమాచారం.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. వారి నిధులను దారిమళ్లించిం ది. దాంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వ అధికారాలు కట్టబెట్టడంతో పాటు 'నీరు-చెట్టు' పథకం కింద నిధులు పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆయా నిధులతో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి కూటమితో కలసి నడవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా స్వచ్ఛందంగా ముందుకువచ్చే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కూటమి నాయకత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు బుధవారం నుంచి పార్టీలో చేరికలు ప్రారంభమవుతాయని టీడీపీ నేతల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కూటమి చేతిలో 250 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 486 ఓట్లు రావాలని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా కూటమే గెలుచుకుంటుందని70 ఓట్ల మెజారిటీ కూడా సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి 615, కూటమికి 218 ఓట్లు ఉన్నాయి. ఏజెన్సీలో వామపక్షాలకు 18 ఓట్లు ఉన్నాయి. వారు కూటమితో చెలిమికి అంగీకరించారు.

మాజీ వీసీపై పల్లాకు ఫిర్యాదు

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఏయూ మాజీ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఏయూలో బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కొంత మంది ఎయిడెడ్ ఫ్యాకల్టీని తప్పించడం, మిగిలిన వారిని కొనసాగించడంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు జరిమానా విధించడం క్రిమినల్ చర్యతో సమానమన్నారు. రూసా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వర్సిటీలో అక్రమంగా పనిచేస్తున్న వారందరినీ తొలగించాలని సమితి సభ్యులు కోరారు. పల్లాను కలిసిన వారిలో డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు, డాక్టర్ భాను, దాస్, సూరి, ప్రతాప్ తదితరులున్నారు.

రక్షిత తాగునీరే జల్ జీవన్ ధ్యేయం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 6: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటినందించడమే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్టు ఈ మిషన్ జిల్లా సమన్వయకర్త ఆనం దరావు పేర్కొన్నారు. మండలంలోని తాళ్లవలసలో మంగళవారం నీటి నమూనాలను సేకరించి అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల యాజమాన్య ప్రతినిధుల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు.గ్రామాల్లో తాగునీటి సదుపాయాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డయేరియా నిరోధక చర్యలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏఎన్ఎం, హెచ్ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గొడుగులు పంపిణీ

తగరపువలస, ఆగస్టు 6: మొదలవలసకు చెందిన ఎర్నింటి కృష్ణ మంగళవారం తగరపువలస పరిధిలో గొడుగులను పంపిణీ చేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఎండా వానలనుంచి రక్షణగా ఉండేందుకు వీలుగా వీటిని అందించినట్టు ఆయన వివరించారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 6: మండలంలోని తాటితూరు గ్రామంలో ఇద్దరు విద్యార్థులు అదృశ్యంపై కేసు నమోదైనట్టు భీమిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రమేష్ తెలిపారు. తాటితూరుకు చెందిన సింగిడి సాత్విక్ (13) రాంబోతు షణ్ముఖ్ (13) ఆ గ్రామ పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత వీరు ఇళ్లకు చేరకపోవడంతో తల్లిదండ్రులు అన్ని ప్రాంతాలు వెతికించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, చిన్నారుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు సీఐ రమేష్ చెప్పారు. ఈ విద్యార్థుల సమాచారం తెలిసిన వారు పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

సంఘం శరణం గచ్ఛామి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ ఇన్‌చార్జి వీసీ

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఏయూ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అభ్యుదయ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ నెల 9వ తేదీన ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి-డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా ఈ నాటక ప్రదర్శన జరుగుతుందని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఆర్.రాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 26, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 58, బెండకాయలు 22, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 44, బీరకాయలు 42, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 32, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 150, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 30, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు(కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

శరవేగంగా పార్కు నిర్మాణ పనులు

- చిన్నారుల ఆటలకు ప్రత్యేక పరికరాలు
- వాకర్స్‌కు అనుకూలంగా ట్రాక్ ఏర్పాటు
- యోగా, వ్యాయమానికి ప్రత్యేక వసతులు
- రూ. కోటితో తీర్చిదిద్దుతున్న అధికారులు

విశాలాక్షినగర్, ఆగస్టు 6: జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్ వాసులకు అందుబాటులో పార్కు నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. బీచ్ రోడ్డుకు అభిముఖంగా విశాలాక్షినగర్ మలుపులో రూ.కోటి వ్యయంతో పార్కు నిర్మాణం జరుగుతోంది. ఈ ఏడాది జూన్ 27న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో అధికారులు పకడ్బందీగా పనులు చేపడుతున్నారు. మరో 20 రోజుల్లో స్థానికులకు పార్కు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.



వాకర్స్‌కు అందుబాటులోకి ట్రాక్



యోగా చేసుకునే వారికి నిర్మిస్తున్న షెడ్డు

ప్రత్యేక ఏర్పాట్లు...

బీచ్‌రోడ్డుకు అభిముఖంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మిస్తున్న ఈ పార్కులో యువకులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సుమారు 30 సెంట్ల స్థలాన్ని చదును చేసి చుట్టూ ప్రహరీ నిర్మించి, స్థానికులు వినియోగించుకునేందుకు వీలుగా జిమ్ సామగ్రి, వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు, యోగా సాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారుల కోసం ఆట వస్తువులను సమకూర్చుతున్నారు. స్కేటింగ్ రింక్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



చిన్నారులకు ఆట వస్తువులు

సీనియర్ సిటిజన్లకు ఎంతో మేలు



జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్‌లకు అనుసంధానంగా పార్కు ఏర్పాటు చేయడంతో స్థానికులు, సీనియర్ సిటిజన్లకు ఉపయోగకరంగా ఉంటుంది. పచ్చని మొక్కలతో వృద్ధుల నడకకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం ఆనందం. ప్రస్తుతం వీరంతా రోజూ రోడ్డు దాటి తీరానికి చేరుకుని గడపాల్సి వస్తోంది. దీనివల్ల పలుమార్లు ప్రమాదాలు సంభవించాయి. పార్కు అందుబాటులోకి వస్తే సమస్య తీరుతుంది.

\- గరికిన నూకరాజు టీడీపీ నేత

'హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర, పాల్గొన్న బీజేపీ నాయకులు

పెదవాల్తేరు. ఆగస్టు 6: దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, జిల్లా పథాధికారుల సమావేశంలో మాట్లాడారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నియోజకవర్గాల్లో తిరంగా యాత్ర, బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జెండా ఎగురవేసేలా ప్రచారం చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ వీరుల విగ్రహాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించాలన్నారు. 1947 ఆగస్టు 14 రాత్రి భారత్, పాకిస్తాన్ విభజన జరిగిన సమయంలో లక్షలాదిమంది ఊచకోతకు గురయ్యారన్నారు. ఈ సంఘటనలో అమరులైన వారికి ర్యాలీలో నివాళులర్పించాలన్నారు. ఐదు రోజులపాటు జరిగే హర్ ఘర్ తిరంగాలో కార్యకర్తలతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవ కాంత్, కొల్లి రత్నకుమారి, శ్రీరంగం దానేష్, పొలిమేర శ్రీనివాస్, దిలీప్ వర్మ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ పూజలు



సామూహిక గౌరీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

సింహాచలం, ఆగస్టు 6: శ్రావణమాస తొలి మంగళవారం పురస్కరించుకుని గ్రేటర్ 98వ వార్డులోని గౌరీకల్యాణమండపం నిర్వాహకుల ఆ ధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వేదికపై నిలిపి గణపతి పూజ, పుణ్యాహవచనాలుచేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం క్షీరం తదితర పంచామృతాలతో గౌరీమాతకు విశేష అభిషేకాలను మ హిళలతో అర్చకులు జరిపించారు. 108 మంది మహిళలు కలశ ఆరాధనలతోపాటు అష్టోత్తర శతనామార్చన పూజ చేశారు. గౌరీమాత కథ చదివి వినిపించారు. అనంతరం మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సామూహిక మంగళ గౌరీ వ్రతాలకు కావాల్సిన సామగ్రిని గౌరీ కల్యాణమండపం నిర్వాహకులు ఆళ్ల అప్పలనాయుడు, సూరిశెట్టి అచ్యుతరాము, ఆళ్ల జగన్నాథరావు ఏర్పాటు చేశారు.

పార్కులో విచ్చలవిడిగా పశువుల సంచారం

- అపరిశుభ్ర వాతావరణంతో సందర్శకులకు అవస్థలు



పార్కులో స్వేచ్ఛగా విహరిస్తున్న పశువులు

వెంకోజీపాలెం, ఆగస్టు 6: చిన్నారుల ఆటపాటలతో... వృద్ధులు సేద తీరుతూ, యువత వ్యాయామ సాధనతో ఉండాల్సిన పార్కు పశువుల సంచారం .. పారిశుధ్య సమస్యలతో అస్తవ్యస్తంగా మారింది. ఈ దుస్థితి 16వ వార్డులోని హెచ్‌బీకాలనీ అబ్దుల్ కలాం యూజర్స్ అండ్ రిక్రియేషన్ పార్కులో నెలకొంటోంది. ఇక్కడి స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ స్థలాలన్నీ ఇప్పటికే గోవుల ఫాంలతో నిండిపోయాయి. ఇది చాలనట్టు పశువుల పెంపకందారులు పార్కులను కూడా వదలడం లేదు. రోజూ పాలు తీసిన తరువాత ఆవులను పార్కులోకి వదిలేస్తున్నారు. దీంతో పార్కు పశువుల పేడ, మూత్రాలతో నిండిపోతుంది. రోజూ ఇక్కడకు వస్తు న్న క్రీడాకారులు, కరాటే శిక్షణ పొందే చిన్నారులు వీటిని శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది దీనిపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిరాదరణంగా ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని వేడుకుంటున్నారు.

ఇంటర్నల్ ప్రాక్టికల్స్ పరిశీలన

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగంలో ద్వితీయ సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైకాలజీ ఇంటర్నల్ ప్రాక్టికల్స్‌ను ఏయూ కళాశాల ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. త్వరలో తాను సైకాలజీ తరగతి తీసుకుంటానన్నారు. పాస్ ఎలాంగ్ టెస్ట్, కైనెస్తీసియో మెట్రిక్ టెస్ట్, టాచిస్టోస్కోప్ టెస్ట్, ఫింగర్ డెక్స్టెరిటి టెస్ట్, రియాక్షన్, రెస్పాండ్ టెస్ట్‌ల పరీక్ష విధానం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సైకాలజీ విభాగం హెడ్, టెస్ట్ పరీక్ష తెలిపారు. ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య ఎన్.విజయమోహన్, జయరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్‌పీఏ ఫెలోగా ఆచార్య రాజు

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ 2024 సంవత్సరానికి ఫెలో ఆఫ్ ఐఎస్‌పీఏగా ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సైకాలజీ విభాగం ఆచార్యులు ఎం.వి.ఆర్.రాజు ఎంపిక అయ్యారు. ఉత్తర్వులను ఐఎస్‌పీఏ అధ్యక్షుడు ఆచార్య పి.రామలింగం పంపారు. అక్టోబర్‌లో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగే 14వ ఐఎస్‌పీఏ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆచార్య రాజుకు బహూకరిస్తారు. ఈ సందర్భంగా ఆయనను ఇన్‌చార్జి వీసీ అభినందించారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



ఛిద్రంగా మారిన రాజీవ్‌నగర్ రహదారి

ఆరిలోవ, ఆగస్టు 6: జీవీఎంసీ 10వ వార్డు పరిధి పాత డెయిరీ ఫారానికి సమీపంలోని రాజీవనగర్‌లో రహదారులు అధ్వాన స్థితికి చేరడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులకునోచుకోకపోవడంతో రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో పలుచోట్ల చెరువులు తలపిస్తున్నాయి. కాలువలు సక్రమంగా లేక వాడుక నీరంతా రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగునీటిలో పాదచారులు నడవడానికి వీలుకాని దుస్థితి. టీడీపీ కార్పొరేటర్ కావడంతో జీవీఎంసీ అధికారులు కనీస నిధులు విడుదల చేయలేదు. ఇకనైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి అంతేనా?



తుప్పల్లోంచి మృతదేహాన్ని తీసుకువెళ్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 6: గ్రేటర్ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో శ్మశానవాటిక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ మార్గం తుప్పలతో నిండి ఉంది. దీంతో లోపలికి వెళ్లడానికి తిప్పలు పడాల్సి వస్తోంది. దశాబ్దాలుగా శ్మశానవాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త, పాత వెంకోజీపాలేనికి చెందిన గ్రామ సేవా సంఘం, శ్రీసీతారామ సేవా సంఘాలు శ్మశాన వాటిక అభివృద్ధికి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు అనేకసార్లు వినతి పత్రాలందించారు. కానీ రోడ్డు మార్గం, అసంపూర్తిగా నిలిచిన కాలువ నిర్మాణం పూర్తికాలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికకు ఆనుకొని కొంతమేర కాలువను నిర్మించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీసం పట్టించుకోలేదు. మెయిన్‌రోడ్డు నుంచి లోపలికి కనీసం 300 మీటర్లు వెళ్లాల్సి ఉండగా మార్గమంతా తుప్పలతో నిండి ఉంది. దీంతో తీవ్ర అవస్థల మధ్య అంత్యక్రియలకు వెళ్లాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ఇక్కడ గంజాయి బ్యాచ్ వీర విహారం చేస్తున్నారు.

తల్లి పాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 6: తల్లిపాలతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలరని ఐసీడీఎస్ సెక్టార్-2 సీడీపీవో రమణి కుమారి సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలోని అంబేద్కర్ కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని అన్నారు. తల్లిపాలను పడితే తల్లి, బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందని తెలిపారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. ఏసీడీపీవో శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సెల్వి య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈర్ల దేవి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రమణి కుమారి

శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠం

సిరిపురం: శిశువులకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమైనవని నారీ కేర్ సంస్థ వ్యవస్థాపకులు గాయత్రీదేవి కనుమూరి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిపురంలోని ఓ హోటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువులకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడం, కనీసం రెండు సంవత్సరాల పాటు కొనసాగించడం సురక్షితమని ప్రపంచ సంస్థలు సూచిస్తున్నాయన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7వరకు నిర్వహిస్తుంటారన్నారు. తల్లులు, శిశువులకు సాధికారత కల్పించే దిశగా వారోత్సవాలను నారీ కేర్ సంస్థ నిర్వహిస్తుందన్నారు. నవజాత శిశువులకు ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలతో కూడిన సమతుల పోషణకు తల్లిపాలే మార్గమన్నారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా కలిగే అద్భుత ప్రయోజనాలను గుర్తించి వారోత్సవంలో తమతో చేయి కలపాలని పిలుపునిచ్చారు. పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దామని సూచించారు.

బొత్సకు మరోసారి ఓటమి తప్పదు

- తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్



మాట్లాడుతున్న బీవీ రామ్

భీమునిపట్నం, ఆగస్టు 6: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి మాజీ మంత్రి, వైసీపీ నేత బొత్స సత్యనారాయణకు ఘోర పరాజయం తప్పదని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ హెచ్చరించారు. మంగళవారం బీచ్‌రోడ్‌లోని బీఎస్ఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బొత్స కుటుంబం ఘోరంగా ఓటమిని చవిచూసినా తిరిగి ఏ ముఖం పెట్టుకుని ఆయన ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారో అర్థం కావడంలేదన్నారు. ప్రత్యక్ష ఓటింగ్‌లో పరాజయం పాలైన బొత్సను ఆ పార్టీ విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎంపిక చేయడం వింతగా ఉందన్నారు. విశాఖలో వైసీపీ నాయకులు కరవవడంతోనే పక్క జిల్లానుంచి బొత్సను దిగుమతి చేసుకుం టున్నట్టు ఎద్దేవా చేశారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా నడచుకునే సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు గండిబోయిన పోలిరాజు, కోరాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు నేత్రపర్వంగా ఆర్జిత సేవలు



పుష్పాలంకరణలో స్వామి, దేవేరులు

సింహాచలం, ఆగస్టు 6: వరాహలక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం పలు ఆర్జిత సేవలు నేత్రపర్వంగా నిర్వహించారు. వాటిలో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పుష్పాలంకరణల నడుమ ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన లు చేశారు. మంత్రపుష్పం, కర్పూ నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్యకల్యాణోత్సవాన్ని జరిపారు.

ఏయూను సందర్శించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఏయూ పూర్వ విద్యార్థి, విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎం.మోహనరావు మంగళవారం ఇన్‌చార్జి వీసీ జి.శశిభూషణరావుతో భేటీ అయ్యారు. చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఏయూ అభివృద్ధి, ప్రగతి సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా వీసీని సత్కరించారు. అనంతరం విశ్రాంత ఐపీఎస్ అధికారి అరుణరావుతో కలిసి తాను శాతవాహన హాస్టల్‌ను సందర్శించారు.

'మొక్కలు నాటి సంరక్షించండి'

వెంకోజీపాలెం, ఆగస్టు 6: విశ్వవిద్యాలయాల ప్రాంగణాలలో మొక్కలు నాటి సంరక్షించాలని రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ సూచించారు. మంగళవారం రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన విధంగా మొక్కలు పెంచడం-పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రధాన కర్తవ్యాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ సూచించారన్నారు. గవర్నర్ సూచనలకు అనుగుణంగా తాను వర్సిటీ వీసీలతో ఈ అంశాలపై మాట్లాడటం జరుగుతోందని వివరించారు. వర్సిటీలలో మొక్కలు నాటడం, వాటికి జియో ట్యాగ్ చేసి, ప్రతీ నెల వాటి ప్రగతిని తమకు పంపాలని సూచించారు. వర్సిటీలో పశువుల సంచారం నిరోధించాలని, మొక్కలను సంరక్షించే బాధ్యతలను పటిష్ఠంగా అవలంభించాలని సూచించారు. వర్సిటీలో పరిపాలన కార్యాలయాలు, పరీక్షల విభాగాలు, విభాగాలలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యాలయాలలో ఫైల్స్ నిర్వహణ, భద్రపరచడం, డస్ట్ బిన్‌ల ఏర్పాటు, శుభ్రం చేయడం వంటి పనులు సక్రమంగా నిర్వహించే విధంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం వీసీలతో మాట్లాడుతూ వర్సిటీలలో ఈ దిశగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

సీజ్ చేసిన వాహనాలు యార్డుకు తరలింపు



భీమిలి పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు

భీమునిపట్నం, ఆగస్టు 6: ఏన్నో ఏళ్లుగా స్థానిక పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను పీఎం పాలెంలో ఉన్న వెహికల్ డంపింగ్ యార్డుకు తరలించారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో 84 వాహనాలను యార్డుకు తరలించినట్టు ఎస్ఐ డి.రమేష్ తెలిపారు. ఈ వాహనాల యజమానులు సంబంధిత రికార్డులు, రిలీవింగ్ ఆర్డర్స్ తీసుకువస్తే తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారుల సూచనలమేరకు స్టేషన్ ఆవరణను పచ్చదనం, పరిశుభ్రతతో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వ్యాపార మేధస్సుపై ఏయూలో అవగాహన



వెంకట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, ఆగస్టు 6: ఏయూ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో మంగళవారం వ్యాపార మేధస్సును ఉపయోగించి నిర్వహణ ప్రభావం అనే అంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూఎస్ఏ క్లినికల్ స్టాటిస్టికల్ ఎనాలసిస్ సిస్టం ప్రోగ్రామర్ ఇక్కుర్తి వెంకట్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య చాలా బేధం ఉందన్నారు. నిర్వహణ తత్వశాస్త్రం నియమాలపై వివరించారు. ఓపెన్ మైండెడ్ ఫిలాసఫీని కలిగి ఉండాలని, ఇతర వ్యక్తులు కోరుకున్న విధంగా సహాయం చేయాలన్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ అంబానీ విద్యార్హత అతని మేనేజిమెంట్ స్కిల్ గురించి తెలియజేస్తూ పుట్టుకతోనే నాయకత్వ లక్షణాలను కలిగి అంకితభావంతో పనిచేసి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగారన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ వెంకట్‌ను ఏయూ అధికారులు సత్కరించారు.

వందేభారత్‌కు సామర్లకోట స్టేషన్‌లో హాల్ట్ కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 6: విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833/20834) రైళ్లకు సామర్లకోట స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా కల్పించిన హాల్ట్‌ను ఈనెల మూడు నుంచి మరో ఆరు నెలలపాటు కొనసాగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్

చెన్నై డివిజన్‌లో పవర్ బ్లాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో అలెప్పీ నుంచి ధన్‌బాద్ వెళ్లే 13352 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పొడనూర్, ఇరుగూర్, సూరత్‌కల్ మీదుగా నడుస్తుందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలుకు కోయంబత్తూర్ స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్ట్ ఎత్తివేసిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయంగా పొడనూర్ స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.